రిపబ్లిక్‌డే కవాతుకు రావికంపాడు విద్యార్థులు


రావికంపాడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు గైడ్స్‌లో శిక్షణ ఇస్తున్న, స్కౌట్, గైడ్స్ ఆర్గనైజర్ మరీదు శ్రీహరి

కామవరపుకోట: ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో జరగబోయే గణతంత్ర దినోత్సవ కవాతుకు మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. సంక్రాంతి సెలవుల్లో, ఉదయాన్నే చలిని సైతం లెక్కచేయకుండా కఠోరశ్రమ చేసిన విద్యార్థినులు రిపబ్లిక్ డే కవాతుకు ఎంపికయ్యారు. పాఠశాలలోని స్కౌట్, గైడ్స్ చేరిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈతకొట్టడం, రోడ్ల నిర్మాణం, ప్రథమ చికిత్స పద్ధతులను నేర్పుతారు. ఆయుధాలు లేకుండా కేవలం ఒక కర్రను మాత్రమే వారికి ఇస్తారు. సైనికుల వలె ప్రత్యేక దుస్తులు, మెడలో ఒక స్కార్ఫ్ ఉంటుంది. సత్యం కలిగి, కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడం, రోగులకు సేవచేయడం, పోలీసు వ్యవస్థకు అత్యవసర సమయాల్లో సాయపడటం ద్వారా వీరు సమాజసేవ చేయవచ్చు. విద్యార్థుల ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుంది



పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు స్కౌట్, గైడ్స్‌లో శిక్షణ తీసుకోవడం వలన క్రమశిక్షణ, దేశభక్తి, ఇతరులకు సేవ చేసే గుణం అలవడుతుంది. అలాగే విద్యార్థులు శారీరకంగా ధృఢంగా ఉంటారు. స్కౌట్ గైడ్స్‌లో ప్రవేశిక, ప్రథమ, ద్వితీయ, తృతీయ, రాజ్య పురస్కార్, రాష్ట్రపతి పురస్కార్ వంటి దశలలో శిక్షణ ఇచ్చి వీరికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత విద్య, ఉద్యోగాలు పొందేందుకు ప్రాధాన్యత కలిగి ఉంటాయి.

– బిరుదుగట్ల నాగేశ్వరరావు, జిల్లా స్కౌట్, గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్

సంతోషంగా ఉంది



జిల్లా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పరేడ్‌లో పాల్గొనే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. మాకు అవకాశం కల్పించిన ఉన్నత అధికారులకు, మాకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు.

– వేముల ఝాన్సీ, 8వ తరగతి విద్యార్థిని

సేవాభావం అవర్చుకునే అవకాశం



స్కౌట్, గైడ్స్‌లో చేరటం వలన క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావం, ఉన్నతమైన వ్యక్తిత్వం అలవర్చుకునే అవకాశం వచ్చింది. గణతంత్ర వేడుకల్లో పరేడ్‌లో పాల్గొంటే దేశ సేవలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం వచ్చినట్లు అనిపిస్తుంది.

– పి.కుమారి, 9వ తరగతి విద్యార్థిని

మా తల్లిదండ్రులు గర్వపడుతున్నారు



స్కౌట్, గైడ్ విద్యార్థులుగా శిక్షణ తీసుకుని, జిల్లా గణతంత్ర దినోత్సవం వేడుకల్లో పాల్గొనే అవకాశం వచ్చినందుకు మా తల్లిదండ్రులు ఎంతో గర్వపడుతున్నారు. మాకు ఎంతో సంతోషంగా ఉంది.

– షేక్ బషీరా, 9వ తరగతి విద్యార్థిని

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన సర్పంచ్ అనిత


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న సర్పంచ్ పొన్నాల అనిత

కామవరపు కోట: ఈస్ట్ యడవల్లి గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకురాలు పొన్నాల అనిత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకు సీఎం జగన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పనిచేసి వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సీఎం జగన్ సూచించినట్లు ఆమె తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం


స్వామివారికి కల్యాణం నిర్వహించిన దృశ్యం

చింతలపూడి: దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి కల్యాణం వైభవంగా జరిపించారు. ఏలూరు ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు కె మారుతీ ఆచార్యులు స్వామివారికి కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కె శ్రీనివాసరావు, ఈఓ సన్యాసిరావు తదితరులు హాజరయ్యారు.

వెంకయ్యస్వామికి పూజలు


వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రాజుల కాలనీ అయ్యన్న నగర్‌లో వేంచేసి ఉన్న భగవాన్ శ్రీ గొలగమూడి వెంకయ్య స్వామి సేవా కేంద్రం 18వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి, మూల విరాట్‌కు అభిషేకాలు, అష్టోత్తరం, వివిధ పూజా కైంకర్యాలు వెంకయ్య స్వామి వారి సంప్రదాయం ప్రకారం నిర్వహించినట్లు గొలగమూడి వెంకయ్య స్వామి సేవా కేంద్రం సభ్యులు తెలిపారు. అనంతరం స్వామివారికి ఎంతో ప్రీతికరమైన ధునిపూజ, మహా అన్నదానం నిర్వహించారు. ఈ పూజాది కార్యక్రమాలను గురుదేవులు నెల్లూరు జిల్లా తుమ్మల తొలిపురుకు చెందిన నారాయణదాసు స్వామీజీ పర్యవేక్షించారు.

వేగంగా కులగణన సర్వే


కులగణన సర్వేలో భాగంగా వివరాలు తీసుకుంటున్న వలంటీర్లు

కుక్కునూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే కుక్కునూరు మండలంలో వేగంగా సాగుతోంది. 15 పంచాయతీల పరిధిలో ఇప్పటి వరకు 50 శాతానికి పైగా కుల గణన సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో శ్రీనివాసన్ తెలిపారు. వలంటీర్లు, కార్యదర్శులు కులగణన సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నారు. భవిష్యత్తులో ఈ వివరాలతో ప్రజలకు సంక్షేమ లబ్ధి సులభతరంగా అందజేయవచ్చన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.

హౌసింగ్ ఏఈ వివేకానంద్ సస్పెన్షన్?

చింతలపూడి: గృహనిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వివేకానంద్‌ను బుధవారం విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిసింది. మండలంలో పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారుల నుంచి కింది స్థాయి సిబ్బందిని మధ్యవర్తులుగా పెట్టుకుని పరోక్షంగా అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఏఈ అవినీతిపై విచారణకు ఆదేశించగా మండలానికి మంజూరైన సిమెంట్ బస్తాల్లో 650 బస్తాలు తేడా వచ్చాయని, సుమారు 80 ఇళ్ల నిర్మాణం కోసం డ్వాక్రా మహిళా సంఘాల నుంచి వసూలు చేసిన రూ.25 లక్షల సొమ్మును విజయవాడకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అడ్వాన్స్ పేమెంట్ చేయగా సదరు కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని విచారణలో తేలినట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఈ అవినీతితో సంబంధం ఉన్న మరికొంత మంది ఇంజినీరింగ్ సిబ్బందిని విచారణ చేసే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

మంత్రి వనితను కలిసిన నాయకులు


మంత్రి వనితకు బొకేను అందిస్తున్న గుండుగొలనుకుంట సర్పంచ్ ధనలక్ష్మి, తదితరులు

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితను పలువురు మండల నాయకులు బుధవారం తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అందులో భాగంగా వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, ఘంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి గాంధి, బిరుదుగడ్డ చల్లారావు, జిత్తుక శ్రీను, బిరుదుగడ్డ సుభాకరరావు, బండారు ధనలక్ష్మి, బండారు నాగ సుబ్బారావు, అల్లాడ హరేరామకృష్ణ, మద్దిపాటి చిన్న సోమేశ్వరరావు, మానుకొండ సుబ్బారావు, బండారు కాశీ, కనికెల్లి ఏసు తదితరులున్నారు.

చింతలపూడి ఎస్సైగా కుటుంబరావు



చింతలపూడి: చింతలపూడి ఎస్సైగా ఎం.కుటుంబరావును నియమిస్తూ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన లక్కవరం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో ఎస్సైగా పనిచేశారు. ప్రస్తుతం ముసునూరు ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కె ప్రసాద్‌ను అధికారులు వీఆర్‌కు పంపారు.

నేడు మున్సిపల్ సమావేశం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటల నుంచి సమావేశం జరుగుతుందన్నారు.

మద్యం పట్టివేత

పోలవరం రూరల్: గూటాల గ్రామంలో ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ దాడులు నిర్వహించారు. పి.వెంకన్న అనే వ్యక్తి 50 మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు గుర్తించి అతడిని అరెస్టు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఏలూరు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

‘ఆడుదాం ఆంధ్ర’ నియోజకవర్గస్థాయి పోటీలు ప్రారంభం


చింతలపూడి: పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు


బుట్టాయగూడెం: షటిల్ పోటీలో గెలుపొందిన బుట్టాయగూడెం క్రీడాకారులు

చింతలపూడి: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. క్రీడా పోటీలను జెడ్పీటీసీ ఎం.నీరజ సుధాకర్, ఎంపీపీ డా రాంబాబు నాయక్ ప్రారంభించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక సామర్థ్యం పెరుగుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచే ఎక్కువగా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు తయారవుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ కోఆర్డినేటర్ పిట్టా వేణు మాట్లాడుతూ నాలుగు మండలాల నుంచి 40 టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఈ నెల 30 వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.35 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. హెచ్ఎం సుధాకర్, మండల కోఆర్డినేటర్ సీమోను, నాలుగు మండలాల పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన ఆటల పోటీల్లో బుట్టాయగూడెంకు చెందిన షటిల్ టీమ్ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థాయిలో గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

పొగాకు సాగులో యాంత్రీకరణ అవసరం


జీలుగుమిల్లిలో ఎస్సీ, ఎస్టీ రైతులకు యంత్రాలను అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): పొగాకు సాగులో యాంత్రీకరణ అవసరమని ఐకార్–సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ తెలిపారు. సీటీఆర్ఐ ఆర్ఎస్ జీలుగుమిల్లి హెడ్ వై.సుబ్బయ్య అధ్యక్షతన పొగాకు సాగులో యాంత్రీకరణ ఉపయోగాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శేషుమాధవ్ మాట్లాడుతూ పొగాకు సాగులో కూలీల కొరత వలన యాంత్రీకరణ అవసరమని అన్నారు. దళిత గిరిజన ఉపప్రణాళిక ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులు 150 మందికి ట్యాపింగ్ టూల్, బెయిలింగ్ యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీటీఆర్ఐ మూడు డివిజన్ల హెడ్ డాక్టర్ సరళ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఎల్‌కే ప్రసాద్, పీఎంఈ సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కస్తూరి కృష్ణ, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

‘మద్ది’ని దర్శించిన వైఎస్సార్ సీపీ నేతలు


మద్ది క్షేత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జులకు వేద ఆశీర్వాదం ఇస్తున్న అర్చక స్వాములు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు దర్శించారు. ఎంపీలు మిథున్ రెడ్డి, కోటగిరి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, తెల్లం బాలరాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్ మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించి ప్రసాదాన్ని అందజేశారు.

ఏలూరు సభను విజయవంతం చేయాలి

ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఉమ్మడి గోదావరి, కృష్ణ జిల్లాలకు కలిపి ఈనెల 30వ తేదీన ఏలూరులో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని అన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్


కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. బుధవారం సురేష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా రెండువేల మందికి పైగా హాజరు కావడం, పార్టీ అధినేతలు, ముఖ్య అతిథులు వచ్చే ఎన్నికలలో విజయం మనదేనని ధీమాగా చెప్పడంతో పార్టీ కార్యకర్తలు కేరింతలు కొట్టారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధే మనల్ని గెలిపిస్తాయని.. వచ్చే ఎన్నికల సమరంలో ధైర్యంగా ప్రతిపక్షాలను ఢీకొందామంటూ పార్టీ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు దాసరి శ్రీలక్ష్మి, మొడియం రామ తులసి, స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజి మాలదేవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయి బాల పద్మ, ఎంపీపీలు సుంకర వెంకటరెడ్డి, గంజిమాల రామారావు, పార్టీ నాయకులు గొడ్డటి నాగేశ్వరరావు, మంతెన సోమరాజు, దాసరి విష్ణు, ఆరేటి సత్యనారాయణ, నూకల రాము, అల్లూరి రత్నాజీ, గంటా శ్రీను, చిక్కాల దుర్గాప్రసాద్, తాడిగడప రామకృష్ణ, సంకు కొండ, మందపాటి రామకృష్ణ, పసుపులేటి రాంబాబు, తోట జయ బాబు, మట్టా సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: కొయ్యలగూడెంలో జరిగిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి పోలవరం మండలం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో బయలు దేరి వెళ్లారు.


టి.నరసాపురం నుంచి పార్టీ సమావేశానికి ర్యాలీగా తరలివెళ్తున్న నాయకులు

టి.నరసాపురం: నియోజవకర్గంలోని కొయ్యలగూడెంలో నిర్వహించిన ఏలూరు ఎంపీ, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌ల పరిచయ వేదికకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని 50 వాహనాలలో 200 మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు పార్టీ మండల కన్వీనర్ శ్రీను తెలిపారు. తరలివెళ్లిన వారిలో మండల నాయకులు వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య, కాల్నీడు సుబ్బారావు, పిన్నమనేని చక్రవర్తి, మక్కిన గోపాలరావు తదితరులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన కలెక్టర్


జీలుగుమిల్లి హైస్కూల్‌లో డిజిటల్ బోధనా విధానాన్ని అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించిన జాబితాను ప్రతి తహసీల్దార్ కార్యాలయంలోనూ, సచివాలయాల్లో, పోలింగ్ బూత్‌ల్లో ఉంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ఆ కార్యక్రమ అనంతరం జీలుగుమిల్లి హైస్కూల్ ప్లస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ 70ను పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నది లేనిదీ చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, తహసీల్దార్ సుందర్ సింగ్‌కు తగు సూచనలు ఇచ్చారు.

డిజిటల్ బోధనా విధానంపై ఆరా

పాఠశాలలో డిజిటల్ బోధనా విధానంపై విద్యార్థులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం, అలాగే డిజిటల్ కంప్యూటర్ విద్యాబోధన తదితర అంశాలను, రిజిస్టర్‌లను పరిశీలించారు. తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపీడీఓ కేఆర్ఎస్ కృష్ణప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవానికీ కార్పొరేట్ వైద్యం


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి


జంగారెడ్డిగూడెం: ప్రతి పేదవానికీ కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలు చరిత్రలో నిలిచిపోతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం 4వ సచివాలయం పరిధిలోని 9వ వార్డు పేరంపేట రోడ్డు హెల్త్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలు, ప్రతి గ్రామాన విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లు, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సురక్ష, 104, 108 వాహనాల ఏర్పాటుతో పేదలకు వైద్యసేవలు చేరువ చేశారన్నారు. మొదటి విడత నిర్వహించిన ఆరోగ్య సురక్ష విజయవంతమైందని, రెండో విడతలోనూ అదే స్పందన లభిస్తోందన్నారు. పట్టణంలో నిర్వహించే ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, కమిషనర్ భవానీ ప్రసాద్, ఏలూరు జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, కౌన్సిలర్‌లు ఉగ్గం దుర్గాప్రసాద్, ఎల్.వెంకటేశ్వరరావు, వైద్య విభాగం జిల్లా కార్యదర్శి కఠారి సీతారాంబాబు, పార్టీ నాయకులు బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న గెద్దాడ శ్రీను, కంచర్ల విష్ణు, తల్లాడ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్య, రక్షణ చట్టాలపై అవగాహన


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్

ద్వారకాతిరుమల: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికా విద్య, రక్షణ చట్టాలపై మండలంలోని సీహెచ్.పోతేపల్లి గ్రామంలోని శ్రీ సత్యసాయి విద్యాగిరి పాఠశాల విద్యార్థినులకు స్థానిక సచివాలయ మహిళా పోలీస్ రామిశెట్టి మౌనిక రాణి బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.జాన్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన దృశ్యం

చింతలపూడి: మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను బుధవారం ప్రజాప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని పరీక్షల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. అనంతరం వారి చేతులమీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధనే ప్రభుత్వ లక్ష్యం


పోలవరం రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణల చేతుల మీదుగా ట్యాబ్‌లను అందజేశారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన, సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ చిల్ల దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ రమణ పాల్గొన్నారు.

పోలవరం రూరల్: విద్యను బలోపేతం చేయడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్విరామంగా కృషిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాడుం పుష్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణతో కలిసి ఆయన విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో చూడామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిచయ వేదికను జయప్రదం చేయండి

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పరిచయ వేదిక కొత్తూరులోని సొసైటీ బంక్ ఎదురుగా గల ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జంగారెడ్డిగూడెం: కామవరపుకోటలో గురువారం జరిగే వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌ల పరిచయ వేదికకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో హాజరు కావాలని పార్టీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజు పార్టీ శ్రేణులతో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై సమీక్షిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు పాల్గొంటారని వివరించారు.